అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- సంక్షేమ రంగానికి రూ.2.20 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత సీఎంది
- జగనన్న సురక్ష లో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి


మాచవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సబ్ కలెక్టర్ శోభిక తదితరులు

కందుకూరు: మతాలు, కులాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. జగనన్న సురక్షలో భాగంగా గురువారం పట్టణంలోని యర్రవడ్డి పాలెం, కోటువారివీటిధిలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సురక్ష పథకంలో మంజూరు చేసిన వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 5.30కోట్ల మంది ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలన్నదే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. జనన, మరణ, ఆదాయ, కుల, వివాహ, రేషన్‌కార్డు, ఫ్యామిలీ సర్టిఫికెట్ వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించడమే లక్ష్యంగా నాలుగేళ్ల పాలనలో సంక్షేమ రంగానికి రూ 2.20లక్షల కోట్లు ఖర్చు చేశారని, వీటిలో 70శాతం పథకాలను కేవలం మహిళల పేరుతో అమలు చేశారని గుర్తు చేశారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో 79శాతం మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 84శాతం మంది సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందారని తెలిపారు.

వలంటీర్ల సేవలు కించపర్చడం తగదు

సొంత కుటుంబ సభ్యులే దగ్గరకు రావడానికి భయపడిన కరోనా కాలంలోను వలంటీర్లు ప్రతి ఇంటికి తిరిగి సేవలు అందించారని, కానీ నేడు వారి సేవలను కించపరిచేలా కొందరు వ్యాఖ్యలు చేయడం సరైన విధానం కాదని ఎమ్మెల్యే అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను చేరవేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రూపకల్పన చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తుందని చెప్పారు. కోటువారివీధిలో ఉన్న 14వ సచివాలయం పరిధిలో లబ్ధిదారులను సర్వే చేసి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాల టోకెన్లు జారీ చేయకపోవడంపై ఎమ్మెల్యే సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్పందిన మున్సిపల్ కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుని పేరుతో ఆన్‌లైన్‌లో టోకెన్ రైజ్ చేస్తేనే ధ్రువీకరణ పత్రాలు వస్తాయని చెప్పారు. కానీ ఆన్‌లైన్‌లో రైజ్ చేసిన టోకెన్‌లను ప్రింట్ తీసి లబ్ధిదారులకు ఇవ్వలేదని, చిన్న పొరపాటు వల్ల అలా జరిగిందని వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, డీఈ శ్రీరామమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిశోర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, సచివాలయ కన్వీనర్లు చింతలపూడి మోహన్‌రావు, వల్లూరి సునీత, జాబ్‌జాన్, వడ్లమూడి శేఖర్, దారం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మేలు చేసేందుకే జగనన్న సురక్ష

కందుకూరు రూరల్: పేదలకు మేలు చేసే కార్యక్రమమే జగనన్న సురక్ష అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాచవరం సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పేదలకు కావాల్సిన 11 రకాల ధృవీకరణ పత్రాలు జీవిత కాలం ఉపయోగపడేలా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇలాంటి బృహత్తరమైన కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేపడతున్న పథకాల వైపు దేశం చూస్తుందన్నారు. ఎన్నో ఎళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న చుక్కల భూములను కూడా పరిష్కరించినట్లు చెప్పారు. 12 ఏళ్లుగా భూమిపై ఉన్న వారికే పూర్తి హక్కు కల్పించేలా చర్యలు చేపట్టారన్నారు. అందులో మాచవరం గ్రామానికి చెందిన 64 మంది రైతులకు ఈ హక్కును కల్పిస్తున్నట్లు చెప్పారు. 2011 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూములను ఆన్‌లైన్ చేసుకోమంటే మాచవరం గ్రామంలో కేవలం 17శాతం మంది రైతులు మాత్రమే ఆన్‌లైన్ చేయించుకున్నారన్నారు. మిగిలిన వారంతా కార్యాలయాల చుట్టూ తిరగడానికి సరిపోయిందన్నారు. భూమి ఆన్‌లైన్ కాకపోవడంతో కొందరు వంక దారిలో వాటిని ఆన్‌లైన్‌లో మార్చుకుంటూ వచ్చారన్నారు. ప్రతి సచివాలయంలో ఒక ఆర్బీకేను ఏర్పాటు చేసి అక్కడ నుంచి నాణ్యమైన, విత్తనాలు, మందులు అందిస్తున్నట్లు చెప్పారు. విత్తనాల నాణ్యతను పరీక్షించేందుకే కందుకూరులోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి ఉందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మాచవరంలో 2045 ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఎమ్మెల్యే చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఎంపీడీఓ పి.విజయశేఖర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల, తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డి, ఏఓ వి.రాము, పశువైద్యాధికారి చెన్నకేశవులు, ఏపీఓ ఎల్.సుజాత, ఎంపీటీసీలు శ్రీనివాసులరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నట్లు సబ్ కలెక్టర్ శోభిక అన్నారు. మండలంలోని కొండసముద్రం సచివాలయంలో జగనన్న సురక్ష సర్పంచ్ మన్నం వెంగమ్మ అధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ హాజరై మాట్లాడుతూ వలంటీర్లు వారం నుంచి తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రజలకు ఏ సర్టిఫికెట్లు అవసరమో తెలుసుకొని దరఖాస్తు చేసుకున్నారన్నారు. అనంతరం 796 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్, తహసీల్దార్ సుందరమ్మ, ఆర్‌ఐ నరసయ్య, జెడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎంపీపీ మౌనిక, ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర, నాయకులు మన్నం రమేష్, వైస్ సర్పంచ్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష ప్రారంభించినట్లు ఎంపీడీఓ శేషుబాబు అన్నారు. మండలంలోని ముత్యాలపాడు సచివాలయం వద్ద జగనన్న సురక్ష గ్రామసభలో 1013 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్, ఎంపీటీసీ కన్నె వెంకమ్మ, సర్పంచ్ పోట్లూరి చెంచులక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉలవపాడు: జగనన్న సురక్ష వరం లాంటిదని ఎంపీడీఓ చెంచమ్మ, తహశీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. మండల పరిధిలోని కరేడు-3 సచివాలయం అలగాయపాలెంలో జరిగిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలకు ఉచితంగా అన్ని రకాల సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ మస్తానమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

గుడ్లూరు: జగనన్న సురక్ష ద్వారా అందజేస్తున్న 11 రకాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ పులి రమేష్ అన్నారు. గుడ్లూరు సచివాలయం -2లో గురువారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 11 రకాల సేవలకు సంబంధించి ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటివద్దకే వచ్చి అందజేస్తున్నారన్నారు. తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, ఎంపీడీఓ చంద్రసేన్, సర్పంచ్ పాలకీర్తి శంకర్, ఏఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి


గుడ్లూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ


అలగాయపాలెంలో సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఎంపీడీఓ శేషుబాబు

క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష

టంగుటూరు: మండలంలోని అనంతవరం, ఆలకూరపాడు సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రత్నజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మర్రిపూడి: మండలంలోని 3 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ డి.మాధవీలత గురువారంధో ప్రకటనలో తెలిపారు. మండలంలోని ధర్మవరం ఎస్సీ-1, అయ్యపరాజుపాలెం, కాకర్ల గ్రామాల్లో ఒక్కో ఆయా పోస్టు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హులైన వారు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

66 పొగాకు బేళ్ల తిరస్కరణ


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 66 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాల రైతులు 1068 బేళ్లు వేలానికి ఉంచగా వాటిలో 1006 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.245, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.238.14 పలికింది. వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

108లో సుఖప్రసవం


108 వాహనంలో బిడ్డను ప్రసవించిన సుబ్బరత్తమ్మ

వెలిగండ్ల: మండలంలోని గణేశునికిపల్లికి చెందిన పి.సుబ్బరత్తమ్మ 108 వాహనంలో సుఖప్రసవమైంది. మొదటి కాన్పు నిమిత్తం పురిటినొప్పులు రావడంతో ఆమె బంధువులు గురువారం 108 వాహనానికి ఫోన్ చేశారు. 108 వాహనం గణేశునిపల్లి గ్రామానికి వెళ్లి సుబ్బరత్తమ్మని కనిగిరికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ జాషువా, పైలెట్ రాజారమేష్ సుబ్బరత్తమ్మకి కాన్పు చేశారు. ఆడశిశువుకి జన్మనిచ్చింది. సుబ్బరత్తమ్మ బంధువులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలను వీఆర్వోలుగా నియమించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వీఆర్‌ఏల సంఘం మండల ప్రధాన కార్యదర్శి గుండాబత్తిన రమేష్, జె.రామయ్య, జి.వెంకటేశ్వర్లు, బ్రహ్మనాయుడు, కాలేషా, బ్రహ్మయ్య, సుధాకర్, సందీప్, చెన్నయ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి ఆలయంలో హుండీ చోరీ

గుడ్లూరు: గంగమ్మతల్లి ఆలయంలో హుండీ చోరీకి గురైంది. ఈ సంఘటన మండలంలోని కొత్తపేట గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆలయ పూజారి విజయలక్ష్మి గురువారం ఉదయం గంగమ్మతల్లికి నైవేద్యం పెట్టడానికి గ్రామం బయట ఉన్న గంగమ్మతల్లి ఆలయానికి వెళ్లింది. ఆలయ తలుపుల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపలకు వెళ్లి చూడగా హుండీ కనిపించలేదు. దీంతో విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేసింది. కమిటీ చైర్మన్ వెంకట నారాయణ, గ్రామస్తులు ఆలయం వద్దకు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుబ్బారావు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి గంగమ్మతల్లి ఆలయం వద్దకు చేరుకొని పగులగొట్టిన తలుపులకు పరిశీలించారు. అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు హుండీని అపహరించుకుపోయారని అనుమానం వ్యక్తం చేశారు. హుండీలో సుమారు రూ.90 వేలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కోటిరెడ్డి సేవలు ఆదర్శనీయం


మారెడ్డి కోటిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, వైవీ భద్రారెడ్డి

- విగ్రహాన్ని ఆవిష్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కొండపి: గుర్రప్పడియ మాజీ సర్పంచ్ మారెడ్డి కోటిరెడ్డి సేవలు ఆదర్శనీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. గురువారం కొండపి మండలంలోని గుర్రప్పడియ గ్రామంలో కోటిరెడ్డి విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులు, అలాగే దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైవీ భద్రారెడ్డితో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్‌గా కోటిరెడ్డి అందించిన సేవలను కొనియాడారు. అయన కుటుంబ సభ్యులు సైతం ప్రజాసేవలో ఉండటం మంచి పరిణామమన్నారు. కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొని కోటిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కోటిరెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులతో కలిసి వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దాకా పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి, సర్పంచ్ ఆళ్ల సుజాత, కోటిరెడ్డి కుమారులు ఉదయ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మారెడ్డి రామకృష్ణారెడ్డి, మారెడ్డి శేషారెడ్డి, మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.


వృద్ధులకు వస్త్రాలు అందిస్తున్న వరికూటి అశోక్‌బాబు

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న చేయూత డీపీఎం సరిత

సింగరాయకొండ: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా బ్యాంకుల సహకారంతో కృషి చేస్తోందని చేయూత డీపీఎం పి.సరిత పేర్కొన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం వీఓఏలతో ఆమె సమీక్షించారు. డీపీఎం మాట్లాడుతూ.. వీఓఏలు తన పరిధిలోని గ్రూపు సభ్యులతో జీవనోపాధుల పథకం కింద 50 యూనిట్లు ఏర్పాటు చేసి సభ్యుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇందుకోసం బ్యాంకుల సహకారంతో గ్రూపు సభ్యులకు వ్యక్తిగత రుణాలు అందించాలని సూచించారు. ప్రస్తుతం పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ పథకాల ద్వారా 35 శాతం సబ్సిడీపై రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం ఉందన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ కార్యక్రమం ద్వారా వ్యక్తిగత రుణాలు ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో ఏర్పాటు చేయబోయే మహిళా మార్ట్‌కు గ్రూపుల వద్ద నగదు వసూలు చేయరాదని, గ్రూపు సభ్యుల తీర్మానం ద్వారా పొదుపు అకౌంట్ నుంచి వీఓఏ అకౌంట్‌కు మాత్రమే నగదు బదిలీ చేయాలని, ఈ ప్రక్రియను నెలరోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ సభ్యులకు ఇచ్చే వడ్డీ లేని ఉన్నతి రుణాలు, స్త్రీనిధి, బ్యాంకు రుణాల గురించి తెలియజేయాలని చెప్పారు. కొండపి ఏరియా కోఆర్డినేటర్ జి.రాంబాబు, ఏపీఎం డి.జయరాజ్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఎంఈఓ పరిశీలన


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

ఉలవపాడు: స్థానిక కోటిరెడ్డిగుంటలోని యానాది సంఘాన్ని ఎంఈఓలు ప్రసాద్‌రావు, రమణయ్య పరిశీలించారు. బడికి వెళ్లని పిల్లల తల్లితండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించారు. డ్రాపౌట్స్ సర్వే నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు శాంతినికేతన్, సెయింట్‌జోసఫ్స్ పాఠశాలలను ప్రసాద్ పరిశీలించారు. ఫీజులు సంబంధించిన బోర్డులు బయట ఏర్పాటుచేయాలని సూచించారు. ఎంఈఓ 2 రమణయ్య వీరేపల్లిలోని యానాదికాలనీ పాఠశాలను పరిశీలించారు. నాణ్యమైన బోధన చేయాలన్నారు. సీఆర్పీలు ప్రసాద్, కృష్ణ, ధనలక్ష్మి, అమూల్యలు పాల్గొన్నారు.

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి


టంగుటూరులో రైతులతో మాట్లాడుతున్న పొగాకు బోర్డు కార్యదర్శి వేణుగోపాల్

కొండపి/టంగుటూరు: పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి మేరకే పంట సాగు చేయాలని గుంటూరు పొగాకు బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్ సూచించారు. గురువారం కొండపి, టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది అంతర్జాతీయంగా పొగాకుకు డిమాండ్ ఉండటంతో మార్కెట్ ఆశాజనకంగా సాగిందన్నారు. ఇదే మార్కెట్ వచ్చే ఏడాది ఉంటుందని రైతులు భావించవద్దని చెప్పారు. అధిక ధరలకు పొగాకు బ్యారన్లు, పొలాలను లీజులకు తీసుకోవడం మంచిది కాదని హితవు పలికారు. అదే విధంగా పరిమితికి మించి పొగాకు సాగు చేయటం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం వల్ల భూమి సారవంతమై నాణ్యమైన పొగాకు దిగుబడి సాధించవచ్చన్నారు.

రైతులు అనధికార పొగాకు బ్యారన్లు నిర్మించవద్దని, బయట మార్కెట్‌లో పొగాకు అమ్మకాలు చేయవద్దని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఎం లక్ష్మణరావు, బోర్డు సభ్యుడు బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారులు రామారావు, శ్రీనివాసరావు, ఎస్జీఓ సునీల్‌కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి ఓటరు జాబితా సవరణ


పీసీపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉష

కొండపి: ఓటరు జాబితా సవరణ సర్వేలో భాగంగా మండలంలోని బీఎల్‌ఓలు శుక్రవారం నుంచి ప్రతి ఇంటికీ వస్తారని తహసీల్దార్ టి.నరసింగరావు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. మండలంలోని 43 పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్లు బీఎల్‌ఓ వద్ద యాప్‌లో తమ వివరాలు సవరించుకోవచ్చని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా ఓటు హక్కు కల్పిస్తారని తెలిపారు. ఆగస్టు 21వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల తరపున వారి ఏజెంట్లు బీఎల్‌ఓలకు సహకరించాలని కోరారు.

ఇంటింటి సర్వేలో బీఎల్‌ఓలకు సహకరించాలి

సింగరాయకొండ: ఓటర్ల జాబితాలో సవరణలు, నూతన ఓటరు నమోదుకు సంబంధించి బీఎల్‌ఓలు నిర్వహించే ఇంటింటి సర్వేకు ఓటర్లు సహకరించాలని తహసీల్దార్ సీహెచ్ ఉష విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఓటరు జాబితా సవరణలపై బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. బీఎల్‌ఓ వచ్చేటప్పుడు ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారికి ముందస్తు సమాచారం ఇస్తారని తెలిపారు. ఓటరు జాబితాలో అన్ని రకాల సవరణలను బీఎల్‌ఓ వద్ద యాప్‌లో చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్లు తమ ఆధార్‌కార్డు, రైస్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ధ్రువీకరణ పత్రాలో ఏవైనా రెండు జెరాక్స్ కాపీలు బీఎల్‌ఓకు అందజేయాలని సూచించారు.

ఇంటింటి సర్వే చేపట్టాలి

పీసీపల్లి: బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రెవెన్యూ బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓ ప్రతి ఇంటికి తిరిగి అర్హులైన కొత్త ఓటర్లను చేర్చాలని, ఓటర్లలో సవరణలు, మార్పులుంటే చేయించాలన్నారు. ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

టంగుటూరు: ఓటరు జాబితాలో సవరణలకు శుక్రవారం నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు కొండపి నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఈఆర్వో నారదముని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఆర్వో, టంగుటూరు తహసీల్దార్ సంజీవరావు, డీటీ శ్రీనాథ్, బీఎల్వోలు పాల్గొన్నారు.


కొండపి : మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింగరావు


టంగుటూరు : మాట్లాడుతున్న ఈఆర్వో నారదముని

హైదరాబాద్‌లో డెంగీతో చిన్నారి మృతి!

- కుటుంబాన్ని పరామర్శించిన వరికూటి


బాలుడి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వరికూటి, నాయకులు

టంగుటూరు: మండలంలోని జయవరం గ్రామానికి చెందిన జీవన్ జోసెఫ్(11) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా గురువారం స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. గ్రామానికి చెందిన జయపాల్, రూత్ మైరీ దంపతులకు ఇద్దరు కుమారులు. హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. చిన్న కుమారుడు జీవన్ జోసెఫ్‌కు జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు గురువారం పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మేదరమిట్ల భరత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కంజుల అంజిరెడ్డి, మల్లవరపు జయరామిరెడ్డి, అన్నెం తిరుపతిరెడ్డి, మల్లవరపు వెంకట్రామిరెడ్డి ఉన్నారు.